క్లుప్తంగా

ముగిసిన ఎస్‌జీఎఫ్‌ పోటీలు



షటిల్‌ పోటీల్లో అండర్‌–17 విభాగంలో విజేతలు

రాయదుర్గంటౌన్‌: నియోజకవర్గ స్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. సోమవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, యోగా పోటీలు ముగియగా, మంగళవారం పట్టణంలోని మా బ్యాడ్మింటన్‌ అకాడమీలో షటిల్‌కాక్‌ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఐదు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోఆర్డినేటర్‌ నాగేంద్ర తెలిపారు. అండర్‌ 14, అండర్‌ 17 విభాగాల్లో బాలబాలికలను పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు రామంజనేయులు, సుధాకర్‌, పీడీలు దివాకర్‌, జయప్ప, కరియప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కంబదూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్‌, మారెప్పను ఎంఈఓ మదన్‌మోహన్‌ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. స్థానిక మండల పరిషత్‌ సమావేశ భవనంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్‌ బాలకిషన్‌, ఎంపీడీఓ సాల్మన్‌ పాల్గొని, ఉపాధ్యాయులను సన్మానించారు. యూటీఎఫ్‌ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీగా సూర్య ప్రతాప్‌



కూడేరు: డిప్యూటీ తహసీల్దార్‌ సూర్య ప్రతాప్‌ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న విశ్వనాథ్‌ కణేకల్‌ మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎక్సైజ్‌ సీఐగా మహమ్మద్‌ రఫీ బాధ్యతల స్వీకరణ



కంబదూరు: కంబదూరు ఎక్సైజ్‌ పోలీసు స్టేషన్‌కు నూతన సీఐగా మహమ్మద్‌ రఫీ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న తక్కి బాషా కర్నూలు జిల్లా కోవెలకుంట్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాలో ఇంటెలిజెన్స్‌ విభాగంలో పని చేస్తున్న మహమ్మద్‌ రఫీ బదిలీపై కంబదూరు వచ్చారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

- ముగ్గురికి తీవ్రగాయాలు



మృతుడు బొమ్మన్న

రాయదుర్గం టౌన్‌: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన రైతు బొమ్మన్న(55), సత్యమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై మంగళవారం కర్ణాటకలోని బైరసముద్రం మారెమ్మ గుడి జాతరకు వెళ్లారు. పూజాదికాలు ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు టి.వీరాపురం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై చాలా వేగంగా వస్తున్న ఆంజనేయులు, గురుస్వామి ఢీకొన్నారు. ఘటనలో బొమ్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యమ్మతోపాటు ఆంజనేయులు, గురుస్వామికు తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో తొలుత రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. సత్యమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డీఎల్‌డీఓకు సన్మానం



డీఎల్‌డీఓను సత్కరిస్తున్న అధికారులు

గుమ్మఘట్ట: బదిలీపై వెళ్తున్న డీఎల్‌డీఓ శంకర్‌ను మండల పరిషత్‌ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది మంగళవారం సన్మానించారు. డ్వామా పీడీగా గుంటూరుకు బదిలీపై వెళ్లడంతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు శ్వేతపద్మిని, రాజేష్‌, మోహన్‌,టెక్నికల్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపిక



ఉమేష్‌ చంద్ర

వజ్రకరూరు: చాబాలలోని జెడ్పీహెచ్‌ఎస్‌ 9వ తరగతి విద్యార్థి ఉమేష్‌చంద్ర రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జరిగిన అండర్‌ 14 బాలుర విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. సర్పంచు మల్లెల జగదీష్‌, హెచ్‌ఎం నాగేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్‌ అభినందించారు.

కొత్త వాటికి వాత..ఉన్నవాటికి కోత

- కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్‌ అందజేస్తామని కూటమి నేతల హామీ
- కొత్త పింఛన్ల కోసం ఓపెన్‌ కాని వెబ్‌సైట్‌
- గత ప్రభుత్వ హయాంలో అర్హుల నుంచి నిరంతరాయంగా దరఖాస్తుల స్వీకరణ
- ప్రతి ఆరునెలలకోసారి లబ్ధిదారుల గుర్తింపు



ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఉరవకొండ: ఉరవకొండ పట్టణానికి చెందిన జీ ప్రభాకర్‌కు 55 ఏళ్ల వయస్సు ఉంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్‌ అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆయన సచివాలయానికి వెళ్లి పింఛన్‌ కోసం దరఖాస్తు చేసుకోవాలని అక్కడి సిబ్బందిని అడిగారు. వెబ్‌సైట్‌ ఓపెన్‌ కావడం లేదని వారు చెప్పడంతో నిరాశగా వెనుతిరిగాడు. ఇలా రెండు వారాల నుంచి అతను సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఇలా కేవలం ప్రభాకర్‌ ఒక్కడే కాదు.. 50 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్క నిరుపేద పింఛన్‌ కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొత్త పింఛన్లు కోసం అర్హులైన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా ఇంత వరకూ ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి. అందుకు సంబంధించిన చర్యలు తీసుకోలేదు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఇప్పటికే ఉన్న పింఛన్లను కూడా వెరిఫికేషన్‌ పేరుతో పెద్ద ఎత్తున తొలగించడానికి శ్రీకారం చుట్టారు. కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించినా ఇంత వరకు వాటికి సంబంధించిన వెబ్‌సైట్‌ కూడా తెరుచుకోలేదు. దీంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు.

పింఛన్లు తొలగించేందుకు కుట్ర..

కొత్త పింఛన్లు మాట దేవుడెరుగు..ప్రస్తుత ప్రభుత్వం వస్తున్న పింఛన్లు తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుట్ర పన్నుతున్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లో టీడీపీ నాయకులు సూచించిన పింఛన్‌దారులను అనర్హులుగా గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం మూడు నియోజకవర్గాల పరిధిలో 1,500 నుంచి 2 వేల మందిని అనర్హులుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. అక్టోబర్‌ నెలాఖరులోపు గ్రామసభలు ద్వారా అనర్హత పేరుతో పింఛన్లు తొలగించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు.

జగనన్న హయాంలో నిరంతరాయంగా స్వీకరణ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన వారి నుంచి నిరంతరాయంగా వలంటీర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించేవారు. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త వారికి పింఛన్లు మంజూరు చేశారు. వలంటర్లే అర్హుల అర్హత పత్రాలు సేకరించి, సచివాలయాల్లో దరఖాస్తు చేయించేవారు. పింఛన్‌ మంజూరు అయ్యాక ఇంటికి వెళ్లి పింఛన్‌ అందించేవారు. పింఛన్ల మంజూరు పక్రియ పార్టీలు, కులమతాలకు అతీతంగా సాగేది.

పింఛన్‌దారులు - అనర్హులుగా గుర్తించిన వారి వివరాలు

నియోజకవర్గం పేరు	మొత్తం పింఛన్‌లు	అనర్హులుగా గుర్తించినవి
ఉరవకొండ	36,103	220
కళ్యాణదుర్గం	37,784	590
రాయదుర్గం	37,968	690
	1,11,855	1500

కొత్తగా దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు రావాలి



కొత్త పింఛన్లు మంజూరు చేయడానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఇప్పటి వరకు వెబ్‌సైట్‌ కూడా ఓపెన్‌ కావడం లేదు. దరఖాస్తులు తీసుకొని 50 ఏళ్లు పూర్తి అయిన వారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రభుత్వం ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు.అందుకు సంబంధించిన ఆదేశాలు అందిన వెంటనే చర్యలు చేపడతాం.

– చంద్రమౌళి, ఈఓఆర్డీ, ఉరవకొండ

ఇప్పేరు రజాక్‌ మృతి తీరనిలోటు

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి



రజాక్‌ భౌతికాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరుకు చెందిన వైఎస్సార్‌ సీపీ నేత దూదేకుల రజాక్‌ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి రజాక్‌ ఇంటికి వెళ్లి ఆయన భౌతికాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రజాక్‌ మృతి వైఎస్సార్‌ సీపీకి తీరని లోటు అన్నారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇప్పేరు సర్పంచ్‌ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌, పార్టీ మండల కన్వీనర్‌ రామచంద్రారెడ్డి, నేతలు సీపీ వీరన్న, బెస్త రమణ, తిమ్మారెడ్డి, వన్నూరు స్వామి, కేశన్న, రాగే కిష్టప్ప,గీతమ్మ, బాషా, ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్‌: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరం అని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని కేజీబీవీలో 'బాలికలను రక్షిద్దాం–బాలికలను చదవనిద్దాం' కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసికంగా, శారీరక ఒత్తిడికి గురవుతారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేయటానికి ప్రయత్నిస్తే వెంటనే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1098, 112 నెంబర్లకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ టీం లీడర్‌ ఆదినారాయణ, కేజీబీవీ వార్డన్‌ నాగజ్యోతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

విడపనకల్లు: అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌ గేమ్స్‌ అండర్‌ -14,-17 విభాగంలో మాళాపురం కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్‌ తులసీ ప్రియ మంగళవారం తెలిపారు. బాల్‌ బ్యాడ్మింటన్‌ అండర్‌–14 విభాగంలో మహేశ్వరి, అండర్‌ – 17 విభాగంలో అమృత, వెంకటలక్ష్మి ప్రతిభ కనబరిచారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందన

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని జి. శివలింగమ్మ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ అథ్లెటిక్స్‌ 1,500 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో రెండోస్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినందున విద్యార్థిని శివలింగమ్మను హెచ్‌ఎం చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం , పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపసర్పంచు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



శివమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

వజ్రకరూరు: వజ్రకరూరు ఉపసర్పంచు మధుసూదన్‌రెడ్డి మాతృమూర్తి పలకలదిన్నె శివమ్మ (94) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వజ్రకరూరుకు చేరుకొని మధుసూదన్‌ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలకలదిన్నె శివమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే లడ్డూ వివాదం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌



మాట్లాడుతున్న జాఫర్‌

కూడేరు: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఈ రాష్ట్రానికి జరిగిన మేలు ఏమి లేదని, ఈ అంశంపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుమల లడ్డూ వివాదానికి సీఎం చంద్రబాబు తెరలేపారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌ ధ్వజమెత్తారు. మంగళవారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో పింఛన్‌ పెంపు ఒక్కటే అమలు చేసి సీఎం చంద్రబాబు చేతులు ఎత్తేశారన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో వారి దృష్టిని మళ్లించేందుకు తిరుమల లడ్డూ ప్రసాదంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజాసంక్షేమానికి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. పీఏబీఆర్‌ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటిని విడుదల చేసి 49 చెరువులను నింపాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు మల్లికార్జున, పెరుగు సంగప్ప, పార్వతీప్రసాద్‌, ముట్టాల శ్రీరాములు,రమణప్ప, వర ప్రసాద్‌, మలరాయుడు, రవికుమార్‌ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్‌ చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఉరవకొండ: జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు



కంబదూరు: జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఎస్‌కే ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్‌ సంబరాల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈపోటీలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వెంకట్‌తాడికొండలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈపోటీల్లో 13 ప్రభుత్వ పాఠశాలలు, 5 ప్రైవేట్‌ పాఠశాలల నుంచి 8,9,10 తరగతి విద్యార్థులు పోటీపడ్డారు. ఇందులో ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రిజ్వానా, సాత్విక్‌, హన్సిక, వివేకానంద స్కూల్‌ విద్యార్థులు శిజా, మలేహా, భూమికలు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్‌ పోటీలకు ఎంపికయ్యారు.

జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్‌కు ఎంపిక

కంబదూరు: జిల్లా స్థాయి చెకుముకి టెస్టుకు కంబదూరు విద్యార్థులు ఎంపికయ్యారు. జేవీవీ ఆధ్వర్యంలో తాలూకా స్థాయిలో జరిగిన చెకుముకి టెస్టులో కంబదూరు జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నాగరాజు మంగళవారం అభినందించారు.



విడపనకల్లులో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విడపనకల్లు: మండల స్థాయిలో చెకుముకి పోటీల్లో విడపనకల్లు జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం జరిగిన పోటీల్లో గడేకల్లు,చీకలగురికి, కరకముక్కల, పెద్ద కొట్టాలపల్లి, పాల్తూరు గ్రామాల విద్యా ర్థులు పాల్గొన్నారు. వీరిని ఎంఈఓ శ్రీనివాసలు,ఉపాధ్యాయులు శ్రీకాంత్‌, సురేష్‌బాబు అభినందించారు.

సబ్సిడీతో విత్తన శనగ పంపిణీ చేయాలి

బెళుగుప్ప: రబీలో ప్రధాన పంట పప్పుశనగ విత్తన సాగుకు 90 శాతం సబ్సిడీ వర్తింపచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్‌ రాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతాంగానికి 2023 రబీలో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టితో పెట్టుబడి కూడా దక్కక రైతులు నష్టపోయారన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

కూడేరు: మండలంలోని గొటుకూరు , బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ విజయకుమార్‌, పట్టుశాఖ టీఏ శ్రీనివాసులు, వీహెచ్‌ఏ పుల్లప్ప, వీఏహెచ్‌ఏ దామోధర్‌ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గుమ్మఘట్ట: మండలంలోనిగ్రామాల్లో ఉపాధి పనులు గుర్తింపునకు బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. 2న కలు గోడు, 75 వీరాపురం, బేలోడు, గుమ్మఘట్ట, భూపసముద్రం, 3న గొల్లపల్లి, సిరిగెదొడ్డి, మారెంపల్లి, గోనబావి, కె.పి.దొడ్డి, పూలకుంట, గలగల, నేత్రపల్లి, రంగసముద్రం, 4న తాళ్లకెర గ్రామ పంచాయతీలలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మండల వ్యాప్తంగా గ్రామ సభలు

కూడేరు: మండల వ్యాప్తంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తులసీ ప్రసాద్‌ మంగళవారం తెలిపారు.

నేడు చికెన్‌, మటన్‌ విక్రయిస్తే చర్యలు

కళ్యాణదుర్గం: పట్టణంలో గాంధీ జయంతి సందర్భంగా చికెన్‌, మటన్‌ విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్‌ కమిషనర్‌ వంశీ కృష్ణ భార్గవ్‌ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. హోటళ్లలో సైతం నాన్‌ వేజ్‌ విక్రయాలను బంద్‌ చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్‌ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి పట్టణంలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పదోన్నతి ఉద్యోగికి సన్మానం



అనసూయమ్మను సత్కరించిన వైద్యాధికారి, సిబ్బంది

కూడేరు: కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న అనసూయకు సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. మంగళవారం పీహెచ్‌సీలో ఆమెను సన్మానించారు. మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది ఆమెకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యశోద, వెంకటలక్ష్మమ్మ, రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

6,016 మందికి పింఛన్లు పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని 6,016 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో గాంధీ జయంతి

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రిన్సిపాల్‌ రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్లు పరమేష్‌, వెంకటరాముడు, వైస్‌ ప్రిన్సిపాల్‌ మస్తానప్ప, అధ్యాపకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే తెగుళ్ల నివారణ



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు

ఉరవకొండ: ముందస్తు జాగ్రత్తలతోనే కందిపంటలో తెగుళ్లు నివారించొచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్‌ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నముష్టూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్‌ డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు మండల హార్టికల్చర్‌ అధికారి నెట్టికంఠయ్య హాజరయ్యారు.

నేడు గాంధీ జయంతి

కళ్యాణదుర్గం రూరల్‌: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో (సరోజ కాంపౌండ్‌) బుధవారం మహాత్మాగాంధీ జయంతి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొనాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

శెట్టూరు: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రిడ్స్‌ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్‌ శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలో ' మీకు తెలుసా ? అనే కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, వచ్చిన వాళ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

కూడేరు: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయినట్లు మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ చౌదరి మంగళవారం తెలిపారు. లబ్ధిదారులకు నగదు పంపిణీని ప్రత్యేకాధికారి పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా పింఛన్‌దారులు 5,617 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలు
- వివిధ రూపాల్లో కొలువు దీరనున్న అమ్మవారు



ముస్తాబైన ప్రధాన ఆలయం



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



విశేష అలంకరణలో జగదీశ్వరీ అమ్మవారు

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పట్టణంలోని శాంతినగర్‌, కురగాయల మార్కెట్‌, కోర్టు ముందు వెలసిన బన్నీ మహంకాళి అమ్మవారితో పాటు కోటలోని వాసవీ కన్యాకా పరమేశ్వరి, కాళికాంబేశ్వరి, బళ్లారి రోడ్డులోని హటక్వేరుడిశ్వరి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుడికి నిత్య పుస్తక పఠానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం అమావాస్య కావడంతో ఆలయాలన్నీ భక్తులతో సందడిగా కనిపించాయి. శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వద్ద విద్యుత్‌ అలంకణ చేపట్టారు. తొమ్మిది రోజులు పాటు చేపట్టే ఈ ఉత్సవాలను భక్తి,శ్రద్ధలతో నిర్వహించనున్నారు. డీ హీరేహాళ్‌ మండలంలోని ఓబుళాపురం వద్ద ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోనూ దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రులు ముగిసే వరకూ తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు. హిందువులకు అతి ముఖ్యమైన పండుగ దసరా. ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా సమయత్తమయ్యారు.

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరీదేవి ఆలయం దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈసందర్భంగా మంగళవారం దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నట్లు ధర్మకర్త గాజుల శ్యామలమ్మ తెలిపారు. అమ్మవారి దివ్య అలంకరణలో భాగంగా 3న బాలత్రిపురసుందరి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితాత్రిపురసుందరీ, 7న మహచండీదేవి, 8న మహాలక్ష్మిదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని 12న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

కళ్యాణదుర్గం రూరల్‌: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్‌ చేసి, వారి నుంచి రూ.90,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్‌ సీఐలు వంశీకృష్ణ, నీలకంఠేశ్వర్‌ మంగళవారం తెలిపారు.